# కలిసికట్టుగా.. కదలాలి

- కామారెడ్డి నేతలతో మంత్రి కేటీఆర్ భేటీ
- కేసీఆర్‌కు భారీ మెజారిటీయే బీఆర్ఎస్ టార్గెట్
- ప్రతిపక్షాలకు దిమ్మదిరిగే జవాబివ్వాలని ఆదేశం
- హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమీక్ష
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో జరిగిన భేటీ



బీఆర్ఎస్ కామారెడ్డి నేతలతో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ తదితరులు

నిజామాబాద్, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) కామారెడ్డి నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు బుధవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నియోజకవర్గం కావడంతో ఈ ప్రాంతానికి చెందిన వారందరితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమక్షంలో కామారెడ్డి ప్రాంత ముఖ్య నేతలతో విడివిడిగా మండలాల వారీగా సమావేశం అయ్యారు. కామారెడ్డి, మాచారెడ్డి, భిక్కనూర్, దోమకొండ, బీబీపేట, రాజంపేట, రామారెడ్డి మండలాలకు చెందిన వారందరినీ పిలిపించుకొని సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో పరిస్థితులపైనా ఆరా తీశారు. కేసీఆర్ పోటీ చేస్తుండడంతో గెలుపు ఏకపక్షంగానే ఉన్నదని నేతలంతా కుండబద్దలు కొట్టి చెప్పారు. మెజారిటీ కోసమే శ్రేణులంతా కష్టపడి పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు తెలిసింది. మరోవైపు గత బహిరంగ సభలో సూచించినట్లుగా 266 బూత్ కమిటీ ఇన్‌చార్జీల నియామకం, గ్రామాల వారీగా అవసరాల గుర్తింపుపైనా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరా తీశారు. కేటీఆర్ పిలుపుతో కామారెడ్డికి ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్లాలని, సోషల్ మీడియాలో అందరు చురుగ్గా పాలుపంచుకోవాలని కేటీఆర్ సూచించినట్లు సమాచారం.

**క్షేత్ర పరిస్థితులపై ఆరా..**

భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ పోటీచేస్తున్న నియోజకవర్గం కావడంతో కామారెడ్డిపై అందరి చూపు పడింది. బీఆర్ఎస్ అధిష్ఠానం సైతం కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. భారీ మెజారిటీయే లక్ష్యంగా పెట్టుకున్నది. కేటీఆర్ మార్గదర్శకాల మేరకు నియోజకవర్గంలో ప్రజల అవసరాలను గుర్తించే పనిలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నిమగ్నం అయ్యారు. గ్రామాల వారీగా అవసరాలను నమోదు చేయాలని గతంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సూచించిన నేపథ్యంలో ఈ ప్రక్రియ శరవేగంగా జరుగుతున్నది. ప్రజల నుంచి వచ్చిన డిమాండ్లు, వారి ఆశలు, ఆకాంక్షలను పొందుపర్చబోతున్నారు. ఇందులో భాగంగా అన్ని గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు నియోజకవర్గాన్ని మేటిగా నిలిపేందుకు ప్రయత్నాలు ఇప్పటి నుంచే జరుగుతున్నాయి. కేసీఆర్ ప్రాతినిధ్యం వహించే ప్రాంతంలో ఎలాంటి సమస్యలు కనిపించకుండా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నేరుగా ప్రజాక్షేత్రంలో తిరిగి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కావాల్సిన అవసరాలను తీర్చడమే పనిగా పెట్టుకొని బీఆర్ఎస్ కృషి చేస్తున్నది. చెప్పిన మాట ప్రకారం పనులను పూర్తిచేయడమే లక్ష్యంగా అధిష్ఠానం ముందుకు సాగుతున్నది. పదేండ్ల కాలం లో చేసిన పనులను చెప్పుకోవడంతోపాటు చేయబోయే కార్యక్రమాలను సైతం ప్రజలకు వివరించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఎంపీ బీబీ పాటిల్ సమీక్షలో పాల్గొన్నారు.

**బూత్‌కు ఒక ఇన్‌చార్జి నియామకం..**

కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం 266 బూత్‌లు ఉన్నాయి. వీటికి సీనియర్ నాయకుడిని ఇన్‌చార్జీగా నియమించి ప్రచారపర్వాన్ని ఉధృతంగా నిర్వహించాలని బీఆర్ఎస్ అధిష్ఠానం యోచిస్తున్నది. మొన్నటి కామారెడ్డి సభలోనూ కేటీఆర్ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ప్రతి బూత్‌కు పకడ్బందీగా అనుభవం ఉన్న నాయకుడ్ని బాధ్యుడిగా నియమించడం ద్వారా ప్రజల్లోకి సులువుగా వెళ్లే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ప్రజలను సమన్వయం చేసుకోవడంతోపాటు శ్రేణులను కలుపుకొని పోవడానికి ఆస్కారం ఉంటుంది. కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం 8 మండలాలున్నాయి. మండలాల వారీగా అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కార్యవర్గాలన్నీ ఉత్తేజభరితంగా పని చేయాల్సిన అవసరాన్ని కేటీఆర్ నొక్కి చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే అబద్ధాలను తిప్పికొట్టేలా సోషల్ మీడియాను బలంగా వాడుకోవాల్సిన అవసరాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. బూత్ కమిటీ ఇన్‌చార్జీల పనితీరు ఎలా ఉండాలన్న దానిపైనా సలహాలు, సూచనలు ఇచ్చారు. అందరినీ కలుపుకొని పోవడం ద్వారా అనుకున్న మెజారిటీని కేసీఆర్‌కు అందించ వచ్చని కేటీఆర్ హితబోధ చేశారు. కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీచేస్తున్నట్లుగా ప్రకటించడమే తరువాయి గెలుపు అన్నది ఇక్కడ ఖరారు అయ్యింది. కాకపోతే మెజారిటీ మాత్రమే మిగిలి ఉన్నందునా ప్రాధాన్యత స్థాయిలో ఓట్లు రాబట్టాలనే వ్యూహంలో బీఆర్ఎస్ పార్టీ నిమగ్నం కావడంతో ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటు కాబోతున్నదని, అన్ని అవసరాలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్న విషయాన్ని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఉమ్మడి జిల్లాలో నగదు పట్టివేత



ఎల్లారెడ్డిలో స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

నిజామాబాద్ క్రైం/ ఎల్లారెడ్డిరూరల్ /మద్నూర్/ బాన్సువాడ/ దోమకొండ, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతున్నది. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ఆధారం లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలోని రైల్వేస్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మాక్లూర్ తండాకు చెందిన బానావత్ మోతీలాల్ వద్ద రూ.8లక్షలు నగదును గుర్తించామని ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎల్లారెడ్డిలోని మోడల్ స్కూల్ వద్ద ఓకారులో తరలిస్తున్న రూ.15లక్షలను స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అప్పగించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట ఎస్సై గణేశ్, ఏఎస్సై విజయలక్ష్మి, కానిస్టేబుల్ మహేశ్ ఉన్నారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో రూ.రెండు లక్షలు లభించాయి. డబ్బులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో వాహనంలో తరలిస్తున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. దోమకొండ మండలంలోని లింగుపల్లి వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా రూ. 86వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

# నిర్భయంగా ఓటు వేయాలి

- కలెక్టర్ జితేశ్ వీ పాటిల్
- కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**ఓటరు జాబితాలో పేరును పరిశీలించుకోవాలి**





ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ వేసిన ముగ్గును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, అక్టోబర్ 18: ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును హెల్ప్‌లైన్ యాప్ ద్వారా పరిశీలించుకొని తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ కోరారు. ఓటు హక్కును పౌరులందరూ తమ నైతిక బాధ్యతగా వినియోగించాలని సందేశమిచ్చేందుకు స్వీప్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ముగ్గుల పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రలోభాలు, డబ్బులు, కానుకలకు లొంగక మనస్సాక్షి మేరకు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని అన్నారు. బలమైన ప్రజాస్వామ్యం అవసరమనే అంశంతో ఓటు ఆవశ్యకత, ఓటు విలువ, ఓటు నా జన్మహక్కు అనే తదితర సందేశంతో మహిళలు వేసిన ప్రతి ముగ్గును కలెక్టర్ తిలకించి వారిని ప్రశంసించారు. రంగోళీలో పాల్గొన్న వారికి ప్రోత్సాహకంగా గిఫ్ట్ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, మండల రిసోర్సు పర్సన్లు, మహిళలు పాల్గొన్నారు.

**కౌంటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి**

కౌంటింగ్ హాళ్లలో ఓట్ల లెక్కింపు, ఏజెంట్లు కూర్చునేలా పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు సందర్భంగా బుధవారం ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, సంబంధిత అధికారులతో కలిసి ఎస్పీ కార్యాలయం సమీపంలోని కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కామారెడ్డిలోనే జరుగుతుందని, బాన్సువాడ కౌంటింగ్ హాళ్లలో అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేసేందుకు మార్కింగ్ చేయాలని అధికారులకు సూచించారు. హాల్‌లోకి ఒక ప్రవేశ ద్వారం ఈవీఎంలు తెచ్చేలా, మరో ప్రవేశ ద్వారం ద్వారా అధికారులు, ఏజెంట్లు, అభ్యర్థులు వచ్చేలా చూడాలన్నారు. ఓట్ల లెక్కింపు వివరాలు ఎప్పటికప్పుడు మీడియాకు తెలిపేందుకు ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచాలని, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలకు సమాచారం ఇవ్వాలన్నారు.

జిల్లాలోని 125 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మద్యం నిల్వ చేసిన ప్రాంతాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలన్నారు. వారి వెంట ఏఎస్పీ నరసింహారెడ్డి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి దయానంద్ తదితరులు ఉన్నారు.

# బొమ్మ తుపాకీతో హల్‌చల్

- దంపతులను బెదిరించిన నిందితులు
- డయల్ 100కు ఫిర్యాదు చేసిన స్థానికులు
- పోలీసుల అదుపులో ముగ్గురు ఆకతాయిలు



పోలీసుల అదుపులో నిందితులు



స్వాధీనం చేసుకున్న బొమ్మ తుపాకీ

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 18 : నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో బుధవారం పట్టపగలు బొమ్మ తుపాకీతో పోకిరీలు హల్‌చల్ చేశారు. ఈ ఘటనతో దంపతులతో పాటు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రత్యక్ష సాక్షులు, బాధిత దంపతులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మధ్యాహ్న సమయంలో దంపతులు ద్విచక్ర వాహనంపై నగరంలోని ఖలీల్‌వాడి ప్రాంతంలో గల ఓ ప్రైవేటు దవాఖానకు చెకప్ నిమిత్తం బయల్దేరారు. అదే సమయంలో వారి వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు తుపాకీతో బెదిరిస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో ఆ దంపతులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. యువకుల తీరును గమనిస్తున్న చుట్టు పక్కల ఉన్నవారు అక్కడికి చేరుకున్నారు. వారిలో ఒకరు వెంటనే డయల్-100కు ఫిర్యాదు చేశారు. జనం అక్కడికి చేరుకొని వారిని పట్టుకొని చూడగా వారి వద్ద ఉన్నది డమ్మీ తుపాకీ అని గుర్తించారు. అనంతరం సంబంధిత వన్‌టౌన్ పోలీసులకు ఆ ముగ్గురినీ అప్పగించారు. పోలీసులు వారిని విచారించగా డమ్మీ తుపాకీతో దంపతులను బెదిరించిన ఆ ముగ్గురు నగరంలోని మాలపల్లి,ఆటోనగర్‌కు చెందిన అద్నాన్, షేక్ సమీర్, షేక్ కరీంగా గుర్తించారు. అయితే ఆ ముగ్గురు డమ్మీ తుపాకీతో దంపతులను ఎందుకు బెదిరించారని,అసలు డమ్మీ తుపాకీ వెంట బెట్టుకొని వారు ఎందుకు తిరుగుతున్నారనే కోణంలో పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.